# నవజీవనరాగం

**-సి.జయపాల్‌రెడ్డి**

"ఏమండీ పిల్లలు పార్కుకి వెళదామంటున్నారండీ"

"వెళ్లండి"

"మీరు కూడా వస్తే..."

"నేను బయటకెళ్లాలి. నేనెందుకు? నువ్వు తీసుకువెళ్లు."

"ఎన్నిరోజులైందో మనం పిల్లలతో కలిసి బయటకు వెళ్లక. ఏదో పనంటూ రోజూ సాయంత్రం వెళ్లిపోతున్నారు. పిల్లలకు మీరీ మధ్య టైమ్ ఇవ్వడంలేదు."

"రోజూ ఉండేదేగానీ ఈ నస. నన్నొదిలిపెట్టు. సినిమాలకి, పార్కులకి నువ్వు తీసుకువెళ్లు పిల్లలని. నాకు ఓపిక లేదు."

"స్నేహితులతో తిరగడానికి మాత్రం ఓపిక వుంటుంది."

"మిమ్మల్ని వద్దనడంలేదుకదా. నేను రానంటున్నాను అంతే."

"మీరు మాతో రావాలని, పిల్లలకీ నాకూ ఉండదా? అందరూ మీలాగే భార్యాపిల్లల్ని వదిలేసి తిరుగుతున్నారా?"

"నేను మాత్రం బయట జల్సాలకోసం తిరగడంలేదుకదా. మనకోసమేకదా నేను సంపాదించేది."

"ఇప్పుడున్న సంపాదన చాలదా? ఇంకా ఎందుకు... భార్యాపిల్లలతో గడిపే సమయం లేనప్పుడు సంపాదన ఎందుకు?"

"మనం కావాలనుకున్నప్పుడు డబ్బు రాదు. అవకాశాలున్నప్పుడే సంపాదించాలి. నేవెళ్లొస్తా" అంటూ మధుసూదన్ వెళ్లిపోయాడు.

నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది పద్మావతి.

***

"సరళా...సరళా" కూరగాయలు కొంటున్న సరళ పక్కకు తిరిగి చూసింది. చుట్టూ వున్న ఆడవాళ్లల్లో తనకు తెలిసినవాళ్లు ఎవ్వరూ లేకపోవడంతో మళ్లీ కూరగాయలు ఏరేందుకు అటు తిరిగింది.

"సరళా! నేనే పిలిచింది" అంటూ భుజంపై చేయి పడడంతో 'ఎవరబ్బా' అనుకుంటూ మళ్లీ తిరిగింది. తనవైపే నవ్వుతూ చూస్తున్న ఆవిడను వెంటనే పోల్చుకోలేకపోయింది. అంతలోనే తేరుకుని "పద్మావతి" అంటూ ఆగింది.

"అబ్బా... ఇప్పటికైనా గుర్తు పట్టావ్ సంతోషం" ఇద్దరూ కూరగాయలు కొంటున్న గుంపు నుండి కొద్దిగా ఎడం జరిగారు.

"పద్దూ! ఎన్నాళ్లయిందో నిన్ను చూసి" అంటూ గట్టిగా కౌగలించుకుంది. ఆ వెంటనే "అవునూ నువ్వేమిటి ఇలా అవ్వలమ్మలా తయారయ్యావు? కళ్లకింద నల్లటి చారలేమిటి? ముప్పై అయిదేళ్లకే ఇలా తయారయ్యావేమిటి? అందుకే నేను వెంటనే గుర్తు పట్టలేకపోయాను."

"అంత గుర్తుపట్టరాకుండా తయారయ్యానా?"

"ఏం...రోజూ అద్దం చూసుకోవడంలేదా?"

"సరేలేవే అది తరువాత మాట్లాడుకుందాం గానీ మీరు ఈ ఊరెప్పుడొచ్చారు?"

"అయిదారు నెలలవుతోంది. మీరు ఇక్కడే ఉంటున్నట్లు తెలుసు. అడ్రస్ తెలియదు. ఫోన్ నెంబర్ కూడా తెలియదు. అందుకే వచ్చిన దగ్గర నుండి ప్రయత్నాలు చేస్తున్నా ఫలించలేదు. మొత్తానికి ఇలా మార్కెట్‌లో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇంతకీ మీరెక్కడుంటున్నారు?" అని అడిగి తాము ఎక్కడుండేది చెప్పింది.

"సరళా... నువ్వు మాత్రం కాలేజీ రోజుల్లో ఎలా ఉన్నావో ఇప్పటికీ అలాగే ఉన్నావు" అని అంటున్నప్పుడు పద్మావతి ముఖంలో కొద్దిగా దిగులు కనిపించింది.

"మరి నువ్వెందుకు ఇలా తయారయ్యావో చెప్పవే. మీ ఆయన నిన్నేమైనా తాగి వచ్చి కొట్టే రకమా? లేక ఆర్థిక ఇబ్బందులేమైనా ఉన్నాయా... లేక?"

"అమ్మో.. ఆపవే బాబూ...అలాంటివేమీ లేవు."

"కాలేజీ రోజుల్లో ఎలా ఉండేదానివే?" కాస్త విచారంగా అంది సరళ.

"ఆడపిల్లలకు పెళ్లి అయ్యేంతవరకే స్వేచ్ఛ, సంతోషం. ఆ తరువాత అన్నీ బంధనాలే" బాధగా అంది పద్మావతి.

"అప్పటికీ ఇప్పటికీ నేనేమీ మారలేదని నువ్వే అన్నావు. నేను కూడా ఆడపిల్లనే. నాకూ పెళ్లయింది కదా. మరి నేను సంతోషంగానే ఉన్నానుకదా"

"ఏమోనే నేనూ బాగానే వున్నానుగానీ..." ఏం చెప్పాలో అర్థం కాక ఆగిపోయింది పద్మావతి.

"పోనీలేగానీ ఈ ఆదివారం నేను మీ ఇంటికి వస్తాను. ఆ తరువాత ఆదివారం నువ్వు మా ఇంటికి రావాలి" నవ్వుతూ అంది సరళ.

అందుకు పద్మావతి ఒప్పుకున్న తరువాత ఇద్దరూ వీడ్కోలు చెప్పుకుని వెళ్లిపోయారు.

సరళ, పద్మావతి ఇద్దరూ ఇంటర్ నుండి డిగ్రీవరకూ క్లాస్‌మేట్స్. కాలేజీలోనే కాకుండా బయట కూడా ఎప్పుడూ కలిసే ఉండేవారు. వీళ్లిద్దరి స్నేహంవల్ల వాళ్ల రెండు కుటుంబాలు కూడా బాగా కలిసిపోయాయి. ఇద్దరికీ పెళ్లయ్యాక కూడా కొన్నేళ్లదాకా ఉత్తరాలు రాసుకోవడం, ఫోన్‌లో మాట్లాడుకోవడం, అప్పుడప్పుడు కలుసుకోవడం ఉండేది. అయితే రాను రాను కుటుంబ వ్యవహారాల్లో తలమునకలైపోవడంతో వాళ్లిద్దరి మధ్య సంబంధాలు అనుకోకుండానే తగ్గిపోయాయి.

***

ఆదివారం పనులన్నీ ముగించుకుని సరళ కోసం ఎదురుచూస్తోంది పద్మావతి. ఎలాగైనా

సరే తన మనోవేదనను సరళతో చర్చించాలని అనుకుంది. తానెందుకు సరళలాగే సంతోషంగా ఉండలేకపోతోంది. అందరు గృహిణులు ఇలాగే బాధ పడుతుంటారా? ఏమో తానెప్పుడూ ఈ విషయాన్ని తెలుసుకోవాలని ప్రయత్నించలేదు. ఇలా ఆలోచిస్తుండే మధ్యాహ్నం రెండుగంటలకు వచ్చింది సరళ.

"ఏమిటే సరళా ఉదయ టిఫిన్‌కే వస్తావనుకున్నాను. పోనీ భోజనం వేళ కైనా రాకుండా ఇంత ఆలస్యంగా వచ్చేవేమిటి?"

"పద్దూ! ఇలాంటి ఫార్మాలిటీ మాటలు నాకు నచ్చవని నీకు తెలుసుకదా. వాస్తవం నీకూ తెలుసు. ఇద్దరం ఇంటి పనులు చేసుకోవాలి. తెలిసే ఎందుకు మాట్లాడతావే" నవ్వుతూ అంది.



పద్మావతి నవ్వలేక నవ్వుతూ "తెలిసి కూడా ఇలా మొహమాటం మాటలు మాట్లాడడం అలవాటయిందే. సరేగానీ ఇంటి వెనుక బాదం చెట్టుంది. అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం రా" అంటూ సరళ చేయి పట్టుకుని తీసుకువెళ్లింది. ఇంటి వెనుక వైపు వెళుతూ ఇంటిని అంతా చూపించింది పద్మావతి. రెండు పడక గదులు, డైనింగ్ హాల్, కిచెన్, డ్రాయింగ్ రూం, పూజ గది కాకుండా మరొక గది కూడా ఉంది. ఇల్లంతా నీట్‌గా సర్ది వుంది.

"ఇల్లు చాలా బాగుంది. అవునుగానీ మీ ఆయన పిల్లలు కనిపించరేమిటి? బాదం చెట్టు కింద కుర్చీలో కూర్చుంటూ అడిగింది సరళ.

"పిల్లలు పక్కింట్లో వాళ్ల ఫ్రెండ్స్‌తో ఆడుకుంటున్నారు. మా ఆయన ఏదో పార్టీ వుందంటూ పొద్దునే ఫ్రెండ్స్ దగ్గరకు వెళ్లిపోయారు"

పద్మావతి అసంతృప్తికి కారణం ఏమిటో చూచాయిగా తెలిసినట్లనిపించింది సరళకు.

"పద్దూ! ఇప్పుడు చెప్పవే నీ సమస్య ఏమిటో? వీలయితే ఓ ఉచిత సలహా ఇచ్చి వెళతా" నవ్వుతూ అంది.

"ఏమోనే ఇది సమస్య అవునో కాదో కూడా తెలియదు. నేనే అతిగా ఊహించుకుని బాధపడుతున్నానేమో. నువ్వే చెప్పాలి. ఒంటరితనం, అశాంతి, జీవితం నిస్సారంగా గడుస్తున్నట్లు అనిపిస్తోంది. మా ఆయన తొందరగా ఇంటికి రావా

లని, నాతో కబుర్లు చెప్పాలని, తరచుగా పిల్లలతో కలసి సినిమాలకి, షికారుకి వెళ్లాలని వుంటుంది. ఆయనకేవీ పట్టవు. డబ్బు డబ్బు... అంటూ తిరిగి ఏ అర్ధరాత్రో ఇంటికి వస్తారు. ప్రతిరోజూ తాగడం ఎందుకు అంటే రోజూ ఏదో పార్టీలో బలవంతంమీద తాగానని చెబుతాడు. నీకూ, పిల్లలకు ఏ లోటూ రాకుండా చూసేందుకే కదా నేను కష్టపడుతున్నాను అని అంటాడు. ఇంట్లో వున్న వస్తువుల్లాగే నన్నూ ఓ సుఖాన్నిచ్చే యంత్రంగా చూస్తాడేతప్ప నాకూ ఓ మనస్సు వుంటుందని అనుకోడు. పెళ్లయిన కొత్తల్లో బాగానే ఉండేవాడు. నవ్వుతూ వెళ్లే భార్యాభర్తలను చూసినప్పుడల్లా ఏదో తెలియని బాధ. మంచి భర్త, పిల్లలు, ఇల్లు... సుఖంగా బతుకుతున్నానని మావాళ్లు అనుకుంటున్నారు. ఇలా బాధపడుతున్నానని ఎవరికైనా చెప్పినా నన్నే అనుమానంగా చూస్తారు'' చెప్పడం ఆపి శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది పద్మావతి. ఇద్దరి మధ్యా కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. కొద్దిక్షణాల తరువాత గట్టిగా ఊపిరి పీల్చి వదిలి చిరునవ్వు నవ్వింది సరళ.

"నా బాధంతా నీకు నవ్వులాటగా ఉందా?'' అంది పద్మావతి.

"ఛ...ఛ.. నువ్వు బాధపడుతుంటే నేను నవ్వడంలేదే? నువ్వు ఏ కష్టాల్లో లేవని తెలిసేసరికి మనసు తేలికై ఆనందంతో నవ్వాను. మీ ఆయన మంచివాడే. చాలా సంసారాల్లో ఉండే ఈ ఉదాసీనత, వెలితి కొంతకాలం వుంటుంది. కంగారుపడేదేమీలేదు. నీకు నేను చెప్పేదేమిటంటే నీ మొగుడి గురించి ఆలోచించడం మానేసి నీ గురించి ఆలోచించుకో'' అంది సరళ.

అయోమయంగా చూసింది పద్మావతి.

"పెళ్లికి ముందు ఏవేవో నేర్చుకున్నావుకదా. ఏదో ఒకటి జ్ఞాపకంగా పెట్టుకో. ఏదైనా చిన్న ఉద్యోగం చూసుకో. డబ్బుకంటే కూడా నీకంటూ ఒక వ్యాపకం ఏర్పడుతుంది. ఇంట్లో ఉండి కూడా డబ్బు సంపాదించే పనులు ఎన్నో ఉన్నాయి. ఏదైనా కోర్సులో చేరు లేదా మీ కాలనీలో ఇతర ఆడవాళ్లతో కలసి కమ్యూనిటీ సేవ చేయవచ్చు. రచనా వ్యాసంగం చేపట్టు. ఇలా ఏదైన చేయి. అప్పుడు మీ ఆయన గురించి ఆలోచించే టైమే ఉండదు. నువ్వు మునుపటి పద్మావతిలా కనిపిస్తావు'' చివరి మాట అంటూ గట్టిగా నవ్వింది సరళ.

పద్మావతి కూడా చిన్నగా నవ్వింది. సరళ ఇచ్చిన సలహా చిన్నదే అయినా అది వినగానే ఏదో బరువు దిగిపోయినట్లనిపించి గొప్ప ఊరట కలిగింది పద్మావతికి. ఇంకా అవీ ఇవీ మాట్లాడుకుని అప్పుడప్పుడు ఇలాగే కలుసుకోవాలని అనుకున్నారు ఇద్దరూ.

***

ఆ రోజు అర్ధరాత్రి మధుసూదన్ యధావిధిగా తూలుతూ ఇంటికి చేరుకున్నాడు. మూసివున్న తలుపులను ఆసరా చేసుకుని కాలింగ్‌బెల్ నొక్కబోయాడు. ఈలోగా తలుపులు తెరుచుకున్నాయి. డ్రాయింగ్ రూంలో జీరో బల్బు వెలుగుతోంది. పద్మావతి కనిపించలేదు. ప్రతిరోజూ మేలుకుని ఉండి భర్త రాగానే తలుపులు తెరిచే పద్మావతి ఈరోజు అలా చేయలేదు. బెడ్రూంలోకి వెళ్లి చూసాడు. పిల్లలు, పద్మావతి గాఢ నిద్రలో ఉన్నారు. ఎంత ఆలస్యమైనా భర్తకు వడ్డించిన తరువాతే తను భోజనం చేసేది. డైనింగ్ హాలులోకి వెళ్లి చూసాడు. ఒకటే కంచం ఉంది. గిన్నెలన్నీ టేబుల్‌పై ఉన్నాయి. రోజూ పద్మావతి సణుగుతూంటేనే భోజనం చేసేవాడు. ఈరోజు అలా లేకపోయేసరికి మైకంలో అలాగే వెళ్లి మంచంపై పడుకున్నాడు.

ఉదయం కడుపులో మంటగా ఉంటే మెలకువ వచ్చింది మధుసూదన్‌కి. పక్కకి చూస్తే పిల్లలు, పద్మావతిలేరు. బయటకి రాగానే పద్మావతి కనిపించి నవ్వుతూ "ముఖం కడుక్కోండి...టీ తెస్తాను'' అంది.

మధుసూదన్ ఆఫీస్‌కు వెళ్లేటప్పుడు గమనించాడు. పద్మావతి అప్పటికే స్నానం చేసి చక్కగా ముస్తాబయింది. ఏదో కొత్తగా అనిపించి విషయం ఏమిటని అడుగుదామనుకున్నాడు. కానీ అహం అడ్డువచ్చి అడక్కుండానే వెళ్లిపోయాడు. ప్రతిరోజూ ఇలాగే జరుగుతోంది. రాత్రి నిద్ర చెడగొట్టుకోకుండా భోజనం చేసి భర్తకు సర్ది తలుపులు దగ్గరగా వేసి హాయిగా నిద్రపోతోంది. ఉదయం పిల్లలు, భర్త వెళ్లిపోయిన తరువాత బ్యూటీషియన్ కోర్సుకు వెళ్తోంది. వచ్చేటప్పుడు తనకిష్టమైన పత్రికలు తెచ్చుకుంటోంది.


కాలనీలో జరుగుతున్న యోగా తరగతులకు వెళుతోంది. ముందు ముందు దూరవిద్య ద్వారా ఏమైనా డిప్లొమా కోర్సులు చేయాలని ఇంకా ఏమేవో ప్రణాళికలు వేసుకుంటోంది. ఇంట్లో భర్త ఉన్నంతసేపు నవ్వుతూనే మాట్లాడుతోంది. తన అందానికి, ఆరోగ్యానికి మెరుగులు దిద్దుకుంటోంది.

***



## నిజంగా నటిస్తుందా?!

ఈమధ్య స్నేహ కాస్త స్లిమ్మయి కోలీవుడ్ జనాల్ని బాగానే ఆకర్షిస్తోంది. తమిళ క్రేజీ హీరో విజయ్ నటించే కొత్త చిత్రంలో స్నేహని తన సరసన నటింపచేయడానికి కూడా ఆసక్తి కనబరిచాడట. దీనికి స్నేహ కూడా అంగీకరించిందట. ప్రస్తుతం బోల్డంత క్రేజ్ వున్న బికినీ గెటప్ ఈ సినిమాలో కూడా వుంటుందిట. మరి స్నేహలాంటి హీరోయిన్ బికినీల్లో నటిస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు తమిళ సినీ జనాలు.



ఆ రోజు ఎప్పట్లాగే మధుసూదన్ స్నానం చేసి పద్మావతి పెట్టిన టిఫిన్ తిని స్నేహితులవద్దకు బయలుదేరాడు. మధుసూదన్ స్నేహితుల్లో ఉద్యోగాలు చేసేవారు, వ్యాపారం చేసేవారు, అడ్వకేట్లు ఉన్నారు. వీరంతా ఏవో వ్యాపారాలు చేస్తుంటారు. సొంతంగా చేసుకునేవారు పరస్పరం సహకరించుకుంటారు.ఇంకా డబ్బు సంపాదించాలని తహతహలాడేవారే. వీరంతా రోజూ కలుసుకోవడానికి ప్రత్యేకంగా ఓ అపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపార లావాదేవీలు మాట్లాడుకుంటుంటూనే ప్రతిరోజూ మందు కొడుతూ సరదాగా పేకాడుతుంటారు. మధుసూదన్ ముందు గదిలో ఉండగానే తన పేరును ఉచ్ఛరించడంతో యధాలాపంగా ఆగిపోయాడు.

"ఎవరొచ్చినా రాకపోయినా మధుసూదన్ వస్తాడురా. రాగానే టేబుల్ స్టార్ట్ చేద్దాం" అన్నాడు సుధాకర్.

"అవునురా సుధాకర్ వారంరోజులు ఇటువైపు రాలేదేమిటి?" అడిగాడు రాంమోహన్.

"గోవాకు వెళుతున్నానని చెప్పానుకదరా. పిల్లలకు సెలవులు కదా"

"మూర్తీ నువ్వెప్పుడురా ఊటీ వెళ్లేది"

"ఎల్లుండే బయలుదేరేది"

"మధుసూదన్ మాత్రం ఎప్పుడూ ఫ్యామిలీతో కనీసం సినిమాకు కూడా వెళ్లినట్లు అన్పించదేంరా?" అనుమానం వ్యక్తం చేసాడు సుధాకర్.

"అవునురా ఆ మహా ఇల్లాలు ఎంత బాధ పడుతుందో... ఎంత సంపాదించినా భార్యాపిల్లలకు కూడా కొంత సమయం కేటాయించాలిరా" బాధగా అన్నాడు రాంమోహన్.

"ఇలాంటి సున్నిత విషయాల్లో సలహా ఇవ్వలేం కదా ఎంత స్నేహితుడైనా" మూర్తి వంత పాడాడు.

"సంసారాలు విచ్ఛిన్నమయ్యేది ఇలాంటి సందర్భాల్లోనే..." సుధాకర్ ఇంకా ఏదో అంటున్నాడు. మధుసూదన్ మెదడు మొద్దుబారినట్లయింది. గబగబా బయటకు నడిచాడు. కారులో కూర్చుని ఆలోచించడం మొదలు పెట్టాడు. అందరూ ఇక్కడికి వస్తూనే భార్యా పిల్లలపట్ల శ్రద్ధ వహిస్తున్నారు. తను మాత్రమే స్నేహితులు, వ్యాపారం మోజులో పడి భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేసాడు. వెంటనే ఇంటికి వెళ్లడానికి మనసొప్పలేదు. దారిలో ఓ హోటల్‌లో టీ తాగుతూ అరగంట కాలక్షేపం చేసి ఇంటికి చేరుకున్నాడు.

★★★

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత జీవితం ఉండాలి. కుటుంబ సభ్యులమీద ఎంత ప్రేమ ఉన్నా తమ తమ హాబీలను, కెరీర్‌ను కూడా చూసుకోవాలి. ఇదేమీ తెలియకుండా ఎంత నష్టపోయాను. ఎంతమంది ఆడవాళ్లు ఇలా మానసికంగా కృంగిపోతున్నారో? అందుకే మనసులోని బాధను ఇతరులతో పంచుకోవాలని అంటుంటారు. ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది. ఆ దిశగా ప్రయత్నిస్తే తప్పకుండా ఫలితముంటుంది. ఆయన ఎలా ఉండాలని అనుకుంటే అలాగే ఉండనీయి. ఆయన ఆనందాన్ని నేనెందుకు కాదనాలి? ఈ విధంగా ఆలోచిస్తూ పద్మావతి మనసులోనే సరళకు పదేపదే కృతజ్ఞతలు చెప్పుకుంది.

★★★

స్నేహితుల మాటలు విన్నప్పటి నుంచి మధుసూదన్ సాయంత్రాలు ఇంట్లోనే ఉంటున్నాడు. టీవీ చూస్తూ పిల్లలతో మాట్లాడుతూ గడుపుతున్నాడు. భార్యతో మాట్లాడానికి మొహమాటపడుతున్నాడు. వారంరోజులుగా తనను పట్టించుకోవడంలేదని మథనపడుతున్నాడు. తనవల్ల పద్మావతి కొన్నేళ్లుగా ఎంత ఆవేదనకు గురైందోనని పశ్చాత్తాపపడుతున్నాడు. భార్య ఇప్పుడు హుందాగా, అందంగా కనిపిస్తోంది. అవును తనూ డిగ్రీ చేసింది. తెలివైంది. కానీ తను ఆమెను ఎంత చులకనగా చూసాడు. ఆమె వ్యక్తిత్వాన్ని తాను ఏనాడూ గౌరవించలేదని అనుకునేసరికి మధుసూదన్ గిల్టీగా ఫీలయ్యాడు. ఇతర మహిళలతో తను గౌరవంగానే మాట్లాడతాడు. మరి భార్య అనేసరికి ఎందుకీ చులకనభావం? స్నేహితులు గుర్తుకొచ్చారు. కాస్త వెగటుగా అనిపించింది. ఎన్నో విలువైన సాయంకాలాలు భార్యాపిల్లలతో గడపకుండా వృథా అయినందుకు మనస్సు బాధతో మూల్గింది. అహాన్ని పక్కకు పెట్టి భార్యతో మనసువిప్పి మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు.

వారంరోజులుగా ఆఫీసు నుండి ఇంటికి వచ్చి స్నానంచేసి బయటకు వెళ్లకుండా పిల్లలతో మాట్లాడుతూ కూర్చుంటున్న భర్తను చిరునవ్వుతో గమనిస్తోంది పద్మావతి.

★



## అమెరికాలో డబ్బావాలాలు

ముంబై డబ్బావాలాల వృత్తి నైపుణ్యం జగద్విదితం. తాజాగా ఈ డబ్బావాలాల స్ఫూర్తితో అమెరికాలో కూడా ఇలాంటి సేవలు మొదలయ్యాయిట. ముంబైవాళ్లలా భోజనాలను తమ ఇళ్లల్లో తయారుచేసి తీసుకురారు. కానీ కస్టమర్ల ఆర్డర్లు తీసుకుని భారతీయ ఆహారాన్ని హోటల్స్ నుంచి చెప్పిన చోటుకి సప్లై చేస్తారు. మసాచుసెట్స్‌లోని బోస్టన్, కేంబ్రిడ్జిలలో చాలా శాఖలు కలిగిన భారతీయ వంటకాల హోటల్ వన్‌వరల్డ్ క్విజాన్ ఈ సేవల్ని ప్రారంభించింది. వాళ్ల వెబ్‌సైట్‌లో ఒక్క క్లిక్‌తో ఆర్డరిస్తే చెప్పిన చోటుకి వేడి వేడి తాజా భోజనాన్ని పంపిస్తామంటున్నారు ఆ హోటల్స్ నిర్వాహకుడు అమ్రిక్‌పల్లా.

-తటవర్తి

